సాక్షి
ఏలూరు
ఆదివారం | 10 | నవంబర్ | 2024



7,670 కేసుల రాజీ

గత ఏడాది నవంబర్ 9 నుంచి ఇప్పటివరకు 7,670 కేసులను రాజీ చేశామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. 8లో ▸



‘కొండంత’ అక్రమాలు

ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలోని నారసింహుని క్షేత్రంలో గ్రావెల్ మట్టి తవ్వకాల్లో ‘కొండంత’ అక్రమాలు చోటుచేసుకున్నాయి. 8లో ▸



సహస్ర దీపాలంకరణ సేవ

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో నూతనంగా సహస్ర దీపాలంకరణ సేవ శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. 8లో ▸

న్యూస్‌రీల్

26న మహాధర్నా



సంఘీభావం తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక జిల్లా సన్నాహక సమావేశం పిలుపునిచ్చింది. ఏలూరులోని సీఐటీయూ కార్యాలయంలో చలో కలెక్టరేట్ మహాధర్నా విజయవంతం కోరుతూ శనివారం సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. మహాధర్నా జయప్రదం కోరుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 15 నుంచి 24 వరకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు పాల్గొన్నారు.

‘నవోదయ’లో ప్రవేశాలకు దరఖాస్తులు

పెదవేగి: నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువు ఈనెల 19 వరకు పొడిగించారన్నారు. ఈనెల 20, 21న దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం ఉందని పేర్కొన్నారు.


మద్దిలో పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాస సప్తాహ మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు, దేవస్థానానికి పలు రూపాల్లో రూ.2,31,749 ఆదాయం లభించినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. స్వామివారిని తెనాలి సీనియర్ సివిల్ జడ్జి పలగాని రాజశేఖర్ దర్శించుకున్నారు. ఆయన్ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

వీధి దీపాలకు మరమ్మతులు



మహాలక్ష్మినగర్‌లో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంపై ‘వీధి దీపాల నిర్వహణ అంతంతమాత్రం’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ లైటింగ్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో పట్టణంలోని మహాలక్ష్మినగర్, పాతూరు, 34వ వార్డులో నేతాజీ బొమ్మ, 18వ వార్డు పుంతలో ముసలమ్మ గుడి ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయించారు.

పక్కాగా ఓటర్ల జాబితా సవరణ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఓటర్ల సంక్షిప్త సవరణ–2025 రోల్ అబ్జర్వర్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ సెక్రటరీ ఎంఎం నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణితో కలిసి ఓటర్ల జాబితా సవరణపై ఆయన సమీక్షించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 20,25,599 మంది ఉన్నారన్నారు.

సీనియర్లకు మరో ‘సారీ’

నామినేటెడ్ పదవుల్లో మొండిచేయి

- రెండో జాబితాలోనూ నిరాశే
- ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులకు నో చాన్స్
- ముగ్గురు జనసేన నేతలకు అవకాశం
- ఎమ్మెల్యే సీట్లు త్యాగం చేసిన నేతలకు భంగపాటు
- అంతర్మథనంలో టీడీపీ నేతలు





తోట సీతారామలక్ష్మి



గన్ని వీరాంజనేయులు



ముద్దరబోయిన



వలవల బాబ్జీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నామినేటెడ్ పదవుల భర్తీలో సీనియర్లకు సీఎం చంద్రబాబు మళ్లీ షాక్ ఇచ్చారు. పొత్తుల్లో భాగంగా సీట్లు త్యాగం చేసిన వారికి యథావిధిగా మొండిచేయి చూపడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇక జనసేనలోనూ క్రియాశీలకంగా ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సామాజిక కోణంలో పదవులు భర్తీ చేశారు. శనివారం ప్రకటించిన రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నేతకు కేబినేట్ హోదా కలిగిన పదవి, ఇద్దరు జనసేన నేతలకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, మరోనేతకు జోన్ చైర్మన్ పదవి దక్కింది. ఇక ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, తోట సీతామహాలక్ష్మిలకు మొండిచేయి చూపడం టీడీపీలోనే తీవ్ర చర్చకు దారి తీసింది.

అప్పుడు ఇద్దరు.. ఇప్పుడు నలుగురు

తొలి విడతలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం కల్పించగా రెండో విడతలో నలుగురికి నామినేటెడ్ యోగం కలిగింది. నరసాపురం నియోజకవర్గం నుంచి ఇద్దరు నేతలకు పదవులు దక్కాయి. వీరిలో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా టీడీపీకి చెందిన మహమ్మద్ షరీఫ్‌కు కేబినేట్ ర్యాంక్ కల్పించగా, రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన కొత్తపల్లి సుబ్బారాయుడు ఉన్నారు. భీమవరం జనసేనకు చెందిన వి.సూర్యనారాయరాజుకు రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఏలూరుకు చెందిన జనసేన పార్టీ నేత రెడ్డి అప్పలనాయుడుకు ఏపీఎస్ఆర్‌టీసీ విజయవాడ జోన్ చైర్మన్‌గా పదవులు దక్కాయి.

సీనియర్లకు భంగపాటు

ఎన్నికల ముందు కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా టికెట్ దక్కని ఆశావాహులను బుజ్జగించేందుకు టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎమ్మెల్సీలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఎర చూపారు. నరసాపురంలో జనసేన పోటీ చేయగా అక్కడ టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజరామ్మోహననాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, భీమవరంలో టీడీపీ నాయకురాలు తోట సీతారామలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, తాడేపల్లిగూడెంలో టీడీపీ నేత వలవల బాబ్జి, ఉండి నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి జుత్తుక నాగరాజు, పాలకొల్లులో జనసేన ఇన్‌చార్జి బోనం చినబాబు, దెందులూరు జనసేన ఇన్‌చార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీకి చెందిన గన్ని వీరాంజనేయులు, నూజివీడు నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గం నుంచి బొమ్మనబోయిన విజయలక్ష్మి, కమిలి విఠలరావు, వెంకటేశ్వరరాజు తదితర నేతలతో నేరుగా, ఫోన్లలో సంప్రదింపులు జరిపారు. అందరూ కలిసికట్టుగా కూటమి విజయానికి పనిచేయాలని కోరారు. కూటమి అధికారంలోకి రావడంతో గత ఐదు నెలలుగా నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం వీరంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. నెలరోజుల క్రితం తొలి విడత జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు ఏపీఐఐసీ చైర్మన్‌గా, చింతలపూడి నుంచి మాజీ మంత్రి పీతల సుజాతకు ఏపీ వినియోగదారుల కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా పదవి దక్కింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల హామీలతో ఈసారైనా తమకు పదవీ యోగం ఉంటుందని గంపెడాసతో ఉన్న మిగిలిన వారికి మరోసారి నిరాశే ఎదురైంది. అధినేత మాట విని కష్టపడి మిత్రపక్ష అభ్యర్థిని ఎమ్మెల్యే చేస్తే తమకు గుర్తింపు లేకుండా పోయిందని సన్నిహితుల వద్ద వారు వాపోతున్నారు. ప్రతిపక్షంగా ఐదేళ్ల పాటు ఇబ్బందులు పడి నియోజకవర్గంలో, జిల్లాలో పార్టీని నెట్టుకుని వస్తే అధికారంలోకి వచ్చాక పదవులను వేరొకరు ఎంజాయ్ చేస్తున్నారని మదనపడుతున్నారు.

నకిలీ వైద్యుడి కలకలం



తనిఖీ వివరాలు వెల్లడిస్తున్న వైద్యాధికారి

పెనుగొండ: మండలంలోని సోమరాజు చెరువులో నకిలీ వైద్యుడి వ్యవహారం వెలుగుచూసింది. గ్రామంలో కె.కృష్ణ తేజ అనే వ్యక్తి వైద్యుడినంటూ ఏడాదిన్నరగా మోకాలి నొప్పులకు వైద్యం చేస్తున్నారు. ఓ రోగి ఉదంతంతో అధికారులు తనిఖీ చేయగా కృష్ణతేజ వైద్యుడు కాదని, కనీస అర్హత కూడా లేదని తేలింది. కృష్ణతేజ ఎటువంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఇటీవల మందుల షాపు ప్రారంభించి దీనికి అనుగుణంగా ఆస్పత్రిని నడుపుతున్నారు. దీనికి భారీగా ముడుపులు చేతులు మారినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కృష్ణతేజ మత్తు డాక్టర్ లేకుండా తాను మత్తు ఇచ్చి స్టెరాయిడ్స్‌తో వైద్యం చేస్తున్నారని బాధితులు తెలిపారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి వినోద్‌కుమార్ శనివారం సోమరాజు చెరువులో మందుల షాపు, ఆస్పత్రిని తనిఖీ చేశారు. అధిక సంఖ్యలో స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్లు గుర్తించారు. మందుల షాపు మూసేయాల్సిందిగా ఆదేశించామని, పూర్తి నివేదికను జిల్లా వైద్యాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. నకిలీ వైద్యుడిపై గతంలోనే ఫిర్యాదులు అందినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా కొందరు రోగులు కృష్ణతేజకు మద్దతు పలకడం విశేషం.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, సమన్వయకర్తల ఫిర్యాదు
- ఏలూరులో ఏఎస్పీకి వినతిపత్రం అందజేత



ఏఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, సమన్వయకర్తలు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, దుష్ప్రచారాలను చేస్తూ ఆయన గౌరవానికి భంగం కలిగేలా చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. శనివారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును కలిసి ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. నూజివీడు సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప అప్పారావు, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌తోపాటు పలువురు పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులపై అక్రమ కేసులు పెరిగిపోతున్నాయని, ఇది మంచిది కాదన్నారు. గత ఐదేళ్ల కాలంలో, ఇప్పుడు మాజీ సీఎం జగన్, ఆయన కుటుంబ సభ్యులపైనా టీడీపీ అనుబంధ సోషల్ మీడియా కార్యకర్తలు ఇష్టారాజ్యంగా పోస్టులు పెడుతూ తీవ్ర అభ్యంతరకరమైన రీతిలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. అయినా కూటమి ప్రభుత్వం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై మాత్రమే అక్రమ కేసులు బనాయిస్తూ వేధించటం సరికాదన్నారు. దీనిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో వందలాది మంది వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారని, ఏలూరు జిల్లాలో అలాంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, పల్లి శ్రీనివాస్, లీగల్‌సెల్ నాయకులు ప్రత్తిపాటి తంబి, ఎస్సీ సెల్ నగర నాయకులు బండ్లమూడి సునీల్‌కుమార్, స్టాలిన్, ముప్పన భాస్కర్, ఫణి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సర్కిల్ శాఖలకు ఎన్నికైన నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన కొత్త పే స్కేలులోని కొన్ని అంశాలను పునః పరిశీలించి వాటిని పరిష్కరించడంలో సత్వర చర్యలు చేపట్టాలని, త్వరితగతిన మెడికల్ పాలిసీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మహేశ్వరరెడ్డి అన్నారు. అసోసియేషన్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక ఎస్ఆర్ పేటలోని అసోసియేషన్ బిల్డింగ్‌లో నిర్వహించారు. అసోసియేషన్ ఏలూరు, పశ్చిమ గోదావరి (భీమవరం) సర్కిళ్లకు నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించగా ఏకగ్రీవమయ్యాయి. ఏలూరు సర్కిల్ అధ్యక్షుడిగా ఆర్.భీమేశ్వరరావు, కార్యదర్శిగా ఎ.సంజయ్ కుమార్, ట్రెజరర్‌గా ఎస్.శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్వామి, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.రమాదేవి, బిల్డింగ్ సెక్రటరీగా కె.శివశంకరంలను ఎన్నుకున్నారు. భీమవరం సర్కిల్ అధ్యక్షుడిగా ఎ.సతీష్, కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, ట్రెజర్‌గా జీవీజీ రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.సుబ్రహ్మణ్యం, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.సంఘమిత్ర, బిల్డింగ్ సెక్రటరీగా వి. ప్రసాద్ రాజు ఏకగ్రీవమయ్యారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

జంగారెడ్డిగూడెం: మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నాటుసారా, అనధికార మద్యం అమ్మకాలు, ఎన్‌డీపీ మద్యం అమ్మకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం అధిక ధరలకు విక్రయించినా, బెల్టుషాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పెదవేగి: ప్రతి విద్యార్థి గెలుపే లక్ష్యంగా క్రీడల్లో పాల్గొనాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి (డీవీఈఓ) బి.ప్రభాకరరావు సూచించారు. శనివారం పెదవేగి మండలం ఎంఆర్సీ కాలనీలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 13 జిల్లాల బాలురు, బాలికల జట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలు ప్రతి విద్యార్థికి ముఖ్యమని, క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ కె.జయరాజు, పీడీ గురుమూర్తి, జిల్లాల నుంచి వచ్చిన పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

ఏడుగురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా నుంచి ఎస్.పెద్దిరాజు (ఉంగుటూరు), కూనాటి జాన్ (కైకరం), బీఎస్ఎన్ కళ్యాణి (దెందులూరు), గుగ్గులోతు కృష్ణ (ఏలూరు), పశ్చిమగోదావరి జిల్లా నుంచి బీఎల్ నరసింహమూర్తి (వడలి), వీవీఎస్ఎస్ నాగలక్ష్మి (నరసాపురం), పి.పోలారావు (యర్రాయి చెరువు) ఎంపికైన వారిలో ఉన్నారు. ఈనెల 11న అవార్డుల ప్రదానం ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఎంపికైన వారు పురస్కారం అందుకునే అవకాశం లేదు.

కేసు పెట్టి.. కక్షగట్టి..

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లపై వేధింపులు
- జిల్లా కన్వీనర్ జయరామ్ అరెస్ట్
- వారం రోజులుగా పోలీసుల అదుపులోనే..
- మూడు రోజులపాటు రహస్య ప్రాంతంలో విచారణ



జయరామ్‌ను కోర్టుకు తీసుకువెళుతున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరానికి చెందిన బగ్గు జయరామ్ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు ఈనెల 3న ఉదయం 6 గంటల సమయంలో జయరామ్ ఇంటికి వచ్చి ఆయన్ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ రోజు రాత్రి సమయంలో 321, 153 (ఏ), 505 (2), 67 ఆఫ్ ఐటీ యాక్టు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి పంపారు. 4న ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచారు. 5న ఉదయం స్టేషన్‌కు తీసుకువెళ్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో 41 నోటీస్ ఇచ్చి స్టేషన్ బెయిల్‌పై విడిచిపెట్టారు. మరలా 6న ఉదయం పోలీసులు వచ్చి జయరామ్‌ను తీసుకువెళ్లి రహస్య ప్రాంతంలో ఉంచారు. తర్వాత మూడు రోజులుగా ఆయన ఆచూకీ తెలియకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు హైకోర్టులో పిల్ వేయడంతో శనివారం హడావుడిగా స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబసభ్యులకు కబురు పంపారు. అనంతరం సాయంత్రం జయరామ్‌ను కోర్టులో హాజరుపర్చారు.

ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు

ఈ ఏడాది ఏప్రిల్ 13న జయరామ్ తన సోషల్ మీడియా ఖాతాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను విమర్శిస్తూ, రాజకీయ పార్టీల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినట్టు జనసేన పార్టీ భీమవరం టౌన్ సెక్రటరీ పత్తి హరివర్ధన్‌రావు ఈనెల 3న ఫిర్యాదు చేసినట్టు పోలీసులు డైలీ స్టేషన్ రిపోర్టు (డీఎస్ఆర్)లో పేర్కొన్నారు. ముద్దాయి కావాలనే కులమతాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఉద్దేశంతో ఇలా చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని కోరినట్టు డీఎస్ఆర్‌లో నమోదుచేశారు.

రాజకీయ దురుద్దేశంతోనే..

జయరామ్ పోస్టులో కులాలు, వర్గాలకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేకపోగా ఈ ఏడాది మే 12 నుంచి తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఎలాంటి పోస్టులను అప్‌లోడ్ చేయలేదు. కాగా రాజకీయ దురుద్దేశంతో పాత పోస్టు పేరిట ఫిర్యాదు చేసి జయరామ్‌పై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వన్‌టౌన్ పోలీసులు రిమాండ్ కోరగా సెకండ్ ఏడీఎం కోర్టు తిరస్కరించి స్టేషన్ బెయిల్ ఇవ్వమని పంపించింది. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్టేషన్ బెయిల్ తీసుకోవడంతో జయరామ్ శనివారం రాత్రి విడుదలయ్యారు.

మురుగు కాలువ గట్టునూ మింగేశారు

కూటమి నేతల కబ్జాలపర్వం



కాళ్లలో రుద్రాయకోడు మురుగు కాలువ గట్టును తవ్విన దృశ్యం

కాళ్ల: కాళ్ల మండలంలో అధికార పార్టీ నేతల అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. మండల కేంద్రం కాళ్ల గ్రామ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రుద్రాయకోడు మురుగు కాలువ గట్టుని గ్రామానికి చెందిన మట్టి వ్యాపారి, అధికార పార్టీ నేత అక్రమంగా తవ్వి స్థలం పూడిక చేపట్టారు. అయితే కనీసం అధికారులు అటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. కాళ్లకు చెందిన మట్టి వ్యాపారి రుద్రాయకోడు మురుగుకాలువ గట్టును సుమారు 3 అడుగుల లోతు వరకు పొక్లయిన్‌తో తవ్వి మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల డ్రెయిన్ గట్ల పటిష్టతను అధికారులు పరిశీలించారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నాయకులు గట్టు తవ్వకం చేపట్టడం అనుమానాలకు తావిస్తోంది. తవ్వకాలతో గట్టు బలహీనపడి విపత్తుల సమయంలో గండి పడితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆకివీడు డివిజన్ డ్రైనేజీ శాఖ ఏఈ జి.ప్రసాద్‌ని వివరణ కోరగా డ్రెయిన్ గట్టు తవ్వకం విషయం తన దృష్టికి వచ్చిందని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

బడ్జెట్‌లో పీఆర్‌సీకి నిధులు కేటాయించాలి



ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పీఆర్‌సీకి నిధులు కేటాయించాలని, మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక కస్తూర్బా నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.రెడ్డి దొర మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రెసిడెన్షియల్ ట్రైనింగ్ రద్దుచేసి ప్రతి మండల కేంద్రంలో పాఠశాల సమయంలో మాత్రమే ట్రైనింగులు ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు మాట్లాడుతూ అపార్ నమోదులో అనేకమైన ఇబ్బందులు ఉన్నాయని, అధికారులు ఉపాధ్యాయులను తొందరపెట్టి మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఓ.రంగావలి, రాష్ట్ర కౌన్సిలర్ కుటుంబరావు తదితరులు మాట్లాడారు.

రెజ్లింగ్ పోటీల్లో గెలుపు

దెందులూరు: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజయవాడలో శనివారం జరిగిన నేషనల్ సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల ఆటల పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజయం సాధించింది. విజయం సాధించిన జట్టులో దెందులూరు మండలం పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

చాట్రాయి: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాదు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో దాడి చేసి 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక టీడీపీ కార్యకర్త, హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్ కావడం గమనార్హం.

కులగణనకు మద్దతు తెలపాలి

ఏలూరు (టూటౌన్): బీసీల సమగ్రాభివృద్ధికి జాతీయ స్థాయిలో జరపనున్న జనగణనతో పాటే రాష్ట్రంలోని 139 కులాల కుల గణనను తన ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఏలూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సమగ్ర కులగణనపై హైకోర్టు ఆర్డర్ మేరకు ముందుకెళ్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పేద–బడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకునేందుకు జనగణనలో సమగ్ర కులగణన తోడ్పడుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలలో ఉన్న ప్రతి వ్యక్తి కులాన్ని నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు, సామాజిక న్యాయ సాధనతో పాటు, ప్రజలందరికీ సమన్యాయం అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

నారసింహుని క్షేత్రంలో 'కొండంత' అక్రమాలు

- ఐఎస్ జగన్నాథపురంలో అడ్డగోలుగా మట్టి తవ్వకాలు
- బెకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ నిర్వాకం
- తాజా విచారణలో బయటపడ్డ వాస్తవాలు



ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రాంతం

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని నారసింహుని క్షేత్రంలో గ్రావెల్ మట్టి తవ్వకాల్లో 'కొండంత' అక్రమాలు చోటు చేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఒక సంస్థ జరిపిన తవ్వకాల కారణంగా సుందరగిరి పర్వత స్వరూపమే మారిపోయింది. కలెక్టర్ ఆధ్వర్యంలో తాజాగా నిర్వహించిన విచారణలో ఇక్కడ అక్రమంగా 6 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ మట్టి తవ్వకాలు జరిగినట్టు తేలింది. దాంతో తవ్వకాలు జరిపిన సంస్థపై, వారికి కొమ్ము కాసిన అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని తల్లాడ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణ పనులు బెకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ మట్టి తవ్వకాలను మండలంలోని ఐఎస్ జగన్నాథపురం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొండ కింద సర్వే నెంబర్ 425 లో రెండేళ్ల క్రితం చేపట్టారు. ఆ సమయంలో సంస్థ 6.18 ఎకరాల్లో 74,875 క్యూబిక్ మీటర్లు తవ్వుకునేందుకు అనుమతులు పొందింది. అక్కడ ఎలాంటి తవ్వకాలు జరపలేదు. ఆ తరువాత అదే సర్వే నెంబర్‌లోని మరో ప్రాంతంలో 1.48 ఎకరాల్లో 36,107 క్యూబిక్ మీటర్లు తవ్వుకునేందుకు అనుమతి పొంది, 33,637 క్యూబిక్ మీటర్లు తవ్వుకున్నారు. అంతటితో ఆగకుండా అదే సర్వే నెంబర్‌లో మరో చోట ఎలాంటి అనుమతులు లేకుండా 20.95 ఎకరాల్లో 6,15,683 క్యూబిక్ మీటర్లు తవ్వేశారు. ప్రస్తుతం బెకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ కొయ్యలగూడెం మండలం గంగవరం పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతోంది. అక్కడ కూడా నిబంధనలకు విరుద్ధంగానే పనులు జరుగుతున్నట్టు తెలుస్తోంది.

విచారణలో బయటపడ్డ వాస్తవాలు

ఈ నెల 1న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐఎస్ జగన్నాథపురంలో దీపం పథకం–2 ను ప్రారంభించారు. దానికి ముందు ఆయన సుందరగిరి పర్వతంపై కొలువైన నారసింహుడిని దర్శించి, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొండ కింద తవ్వకాలను పరిశీలించారు. తవ్వకాలు జరిపిందెవరు, మట్టిని ఎక్కడికి రవాణా చేశారు, నిబంధనలు ప్రకారమే తవ్వకాలు జరిగాయా? అన్నదానిపై విచారణ జరిపి, నివేదికను వారం రోజులలోపు తనకు అందించాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. విచారణలో బెకెమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ 20.95 ఎకరాల్లో అక్రమంగా 6,15,683 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ మట్టిని కొల్లగొట్టినట్టు తేలింది. సంబంధిత సంస్థకు నోటీసులు ఇవ్వడంతో పాటు, వారికి సహకరించిన రెవిన్యూ, గనుల శాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు కలెక్టర్ నివేదిక సమర్పించారు. జీవ వైవిధ్యానికి విఘాతం కలిగిన కారణంగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

పట్టా భూముల్లో తవ్వకాలు..

సర్వే నెంబర్ 425 లో సుమారు 513 ఎకరాల కొండ పోరంబోకు భూమి ఉంది. అందులో సుమారు 400 మంది రైతులకు 1996, 2008, 2024 లో అప్పటి ప్రభుత్వాలు దాదాపు 470 ఎకరాలకు సాగు పట్టాలను పంపిణీ చేశారు. ఈ భూముల్లోనే గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగాయి. భూమి చదును చేసి అప్పగిస్తామని బెకెమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు రైతులు ఈ తవ్వకాలకు అనుమతిచ్చినట్టు తెలుస్తోంది.

టెన్నికాయిట్ క్రీడా సంబరాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఉప విద్యాశాఖాధికారి ఎం.సేవియ

చింతలపూడి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని నూజివీడు ఉప విద్యాశాఖాధికారి ఎం.సేవియ అన్నారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో అంతర్ జిల్లాల అండర్ –14, అండర్ 17, అండర్ 19 టెన్నికాయిట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వార అత్యున్నత శిఖరాలు చేరుకోవచ్చని సూచించారు. క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. పాఠశాల పీఈటీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 195 మంది బాలికలు, 190 మంది బాలురు, 78 మంది కోచ్‌లు, 15 మంది సాంకేతిక నిపుణులు పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన చిన్న తిరుపతి



భక్తులతో కిక్కిరిసిన అనివేటి మండపం



ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు కార్తీకమాసం పర్వదినాలను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. దర్శన క్యూ లైన్లు, ప్రసాద టిక్కెట్ కౌంటర్లు, కేశఖండనశాల విభాగం, ఆలయ తూర్పురాజగోపురం ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠ క్యూ కాంప్లెక్స్ తదితర విభాగాల్లో భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట భజనలు చూపరులను అలరించాయి.

మద్యం దుకాణం వద్దంటూ నిరసన



ఉప్పుటేరు సెంటర్ సమీపంలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న చినతాడినాడ గ్రామస్తులు

కైకలూరు: నిత్యం పలు గ్రామాల ప్రజలు సంచరించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై ఏలూరు జిల్లా కైకలూరు మండలంలోని చినతాడినాడ గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. కై కలూరు మండలం ఆలపాడు శివారు సోమేశ్వరంలో ఇటీవల బ్రాందీ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. నెల రోజులు గడవడంతో పూర్తి స్థాయి దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. దీంతో ఉప్పుటేరు సెంటర్ నుంచి చినతాడినాడ వెళ్లే ప్రాంతంలో దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్న ప్రాంతం ప్రజలు నిత్యం పెద్ద సంఖ్యలో తిరిగే ప్రాంతమని, అక్కడ ఏర్పాటు చేయడం మహిళలకు ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొంటూ.. చినతాడినాడ గ్రామానికి చెందిన మహిళలు, సర్పంచ్ గండికోట ఏసుబాబు, గ్రామస్తులు జంపన వెంకట పెద్దిరామరాజు, సురేష్‌రాజు, సుబ్బరాజు, వెంకటరామరాజు, స్టెఫిన్‌సన్ తదితరులు నిర్మాణ ప్రాంతం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దుకాణం ఏర్పాటు చేస్తున్న రహదారి నుంచి ప్రతి రోజూ సోమేశ్వరం వద్ద రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేయడానికి మూడు షిఫ్టులలో మహిళలు వస్తారన్నారు. అలాంటి ప్రదేశంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం సరికాదని, దీనిని ఇక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆందోళనపై సమాచారం అందుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్‌కే రమేష్ ఆందోళనకారులతో మాట్లాడారు. గ్రామస్తులు, వ్యాపారులతో చర్చించిన తర్వాతే నిర్ణయానికి వస్తామని, అప్పటివరకు పనులను నిలుపుదల చేయిస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఉమ్మడి పశ్చిమలో 7,670 కేసుల రాజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్) : గత ఏడాది నవంబర్ 9 నుంచి ఇంతవరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 7,670 కేసుల్ని రాజీ చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ పురుషోత్తం కుమార్ అధ్యక్షతన శనివారం న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు నిర్వహించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, పేద ప్రజలు, స్త్రీలు, పిల్లలకు, విభిన్న ప్రతిభావంతులు, ప్రకృతి వైపరీత్యాలకు లోనైన ప్రజలకు ఉచిత న్యాయ సాయం అందిస్తున్నామని తెలిపారు. గత నవంబర్ 9 నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 7,670 కేసులు రాజీ చేశామని, ఇందులో 6,448 క్రిమినల్ కేసులు, 690 సివిల్ కేసులు, 532 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 634 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కె.కె.వి.బుల్లి కృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బి.జె.రెడ్డి, ట్రైనీ మాస్టర్ టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ



ఊయలలో కొలువైన స్వామి, అమ్మవార్లకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో నూతనంగా సహస్ర దీపాలంకరణ సేవ శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. తిరుమల తిరుపతిలో శ్రీవారికి జరిగే విధంగా చినవెంకన్న వైభవాన్ని చాటేలా ఈ సేవను నిర్వహించాలనే ఉద్దేశ్యంతో దాత పీపీ రాజు ఈ సహస్ర దీపాలంకరణ సేవ మండపాన్ని నిర్మించారు. అతి తక్కువ సమయంలో ఈ మండప నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఈ సేవను శనివారం ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు, దాత పీపీ రాజు, ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తిలు ప్రారంభించారు. అనంతరం అర్చకులు స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి ఊపుతూ సేవలు నిర్వహించారు. మండపం మొత్తం దీపపు కాంతులతో భక్తులకు కనువిందు చేసింది. ఈ సేవ ఈ నెల 16న భక్తులకు అందుబాటులోకి వస్తుందని చైర్మన్ తెలిపారు. ఇకపై ప్రతి శనివారం సాయంత్రం 7 గంటల నుంచి జరిగే ఈ సేవలో పాల్గొనదల్చిన దంపతులు టిక్కెట్ రుసు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సేవకు శాశ్వత విరాళంగా రూ.5 వేలు చెల్లిస్తే పదేళ్ళ పాటు ప్రతి ఏడాది ఒక శనివారం సేవ జరిపించుకోవచ్చన్నారు. సేవలో పాల్గొనే భక్తులకు స్వామి వారికి ప్రత్యేక దర్శనంతో పాటు శేషవస్త్రంగా కండువా, రవిక, పటిక బెల్లం చిప్స్, పసుపు, కుంకుమ అందిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కుక్కునూరు: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుక్కునూరు ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం, బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన నిదానపల్లి భానుప్రకాశ్(19) చర్మ వ్యాధి సమస్యతో కొంతకాలంగా బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మండలంలోని పెద్దరావిగూడెం ఆలయం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుమందు తాగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు భానుప్రకాశ్‌ను చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని బాలిక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పల్లవి

కైకలూరు: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన ఘటన కైకలూరు కుమారీ టాకీస్ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగింది. టౌన్ పోలీసుల వివరాలు ప్రకారం కోరుకొల్లు రోడ్‌లో చికెన్ దుకాణంలో పనిచేసే కుమారీ అక్క కుమార్తె పల్లవి(15)ని దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. పల్లవి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. రోజూ సాయంత్రం ట్యూషన్‌కు సైకిల్‌పై వెళ్తుంది. సమీపంలో అత్త ఇల్లు ఉండటంతో అక్కడ కొద్ది సమయం ఉండి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా.. చేపల లోడు లారీ ఢీకొట్టడంతో వెనక చక్రాల కింద పడి మరణించింది. బాలిక మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉల్లిబాంబు పేలుడు ఘటనలో మరొకరు మృతి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో దీపావళి రోజు ఉల్లి నాటుబాంబులు పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న ఏలూరు తూర్పువీధికి చెందిన మల్లా పెద్దిరాజు (65) శనివారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న దుర్గసి సుధాకర్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఏడుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్న పెద్దిరాజు శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

బెల్టుషాపులపై దాడులు

ఏలూరు టౌన్: జిల్లాలో బెల్టు షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య తెలిపారు. 7 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వారం రోజులుగా దాడుల్లో 95 కేసులు నమోదు చేయగా 78 మందిని అరెస్టు చేశామన్నారు. 30 సారా కేసుల్లో 13 మందిని అరెస్టు చేశామన్నారు.